క్లుప్తంగా

కాళీకృష్ణకు గ్లోబల్ హ్యూమన్‌పీస్ గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న దేవరపల్లికి చెందిన కాళీకృష్ణ

దేవరపల్లి: దేవరపల్లికి చెందిన యువ పారిశ్రామిక వేత్త, అఖిల భారత ఆర్యవైశ్య మహాసభ నాయకుడు శ్రీకాకొళపు కాళీకృష్ణకు చెన్నై గ్లోబల్ హ్యూమన్‌పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కరోనా సమయంలో కాళీకృష్ణ చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా సోషల్ సర్వీస్ కేటగిరీలో డాక్టరేట్ ప్రదానం చేసినట్టు యూనివర్సిటీ పేర్కొంది. శనివారం యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవ వేదికపై ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. గతంలో కాళీకృష్ణ సేవా రంగంలో అనేక అవార్డులు అందుకున్నారు. యువ పారిశ్రామికవేత్తగా ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

మానవత సంస్థ ఆర్థిక సాయం


శేషారావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: కొంతకాలంగా గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి మానవత సంస్థ శనివారం ఆర్థికసాయం అందజేసింది. గ్రామానికి చెందిన బైపే శేషారావు, బాడిత నాగేశ్వరరావు, రాచూరి పోసియ్య, కందుల గోతియ్యకు ఒకొక్కరికి రూ.4 వేల చొప్పున రూ.16 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, మాజీ ఉపాధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్, గుళ్లపూడి వెంకటరత్నం, భోగవల్లి వెంకట సుబ్బారావు, నందం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీల వినతి

పెరవలి: అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఆందోళనకారులు వినతిపత్రం ఇచ్చారు. పెరవలి తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె ఐదో రోజుకు చేరింది. న్యాయమైన కోర్కెలు నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఆందోళనకారులు తెలిపారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

తాళ్లపూడి: మండల అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని కోరారు.

గడువు తీరిన రాగి పిండి సరఫరా

- సరఫరా ఏజెన్సీ నిర్వాకం

తాళ్లపూడి: మండలంలోని పాఠశాల విద్యార్థులకు సరఫరా చేస్తున్న రాగి పిండి గడువు తేదీ ముగిసింది ఇవ్వడంతో ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులకు, రేషన్ సరఫరా చేసే ఏజెన్సీల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్న సందర్భాలున్నాయి. ప్రభుత్వం నుంచి మండలంలోని 36 ప్రాథమిక పాఠశాలలకు ఈ నెల రాగిపిండి ఏజెన్సీ వారు ప్యాకెట్ల గడువు తేదీ ముగిశాక కూడా పంపిణీ చేశారు. అక్టోబర్ 15న తయారైన పిండి ప్యాకెట్‌కు రెండు నెలలు గడువు ఉన్నట్టుగా ఉంది. డిసెంబర్ 15తో ఈ ప్యాకెట్ల గడువు ముగిసింది. పాఠశాలల్లో వారంలో మూడు రోజుల పాటు విద్యార్థులకు రాగి జావ ఇస్తున్నారు. ఏజెన్సీ వారి నిర్వాకంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు రాకముందే చర్యలు తీసుకోవాలని అధికారులను తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ఎంఈఓ సీహెచ్ బాలమణిని వివరణ కోరగా, గడువు ముగిసిన రాగిపిండి విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం నుంచి స్కూళ్లలో రాగిజావ నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. మరలా కొత్త స్టాకు పంపించాక రాగి జావను కొనసాగిస్తారని వెల్లడించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు
- సచివాలయ, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ ప్రారంభం
- 189 రైతులకు సి-క్లాస్ పట్టాలు అందజేత


కాకరపర్రులో సి-క్లాస్ పట్టాలను రైతులకు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

పెరవలి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తెచ్చి, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు అన్నారు. కాకరపర్రులో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ, రూ.23.80 లక్షలతో హెల్త్ క్లినిక్ భవనాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకరపర్రులో ఇప్పటివరకు రూ.11.45 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని, రూ.32.45 కోట్లను సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అలాగే ప్రభుత్వ భవనాలను రూ.17.80 కోట్లతో నిర్మించామని తెలిపారు. దీంతో పాలనంతా గ్రామాలకు చేరినట్టయిందని వివరించారు. గత టీడీపీ పాలనలో ఇసుక, మట్టిని ఇష్టారాజ్యంగా దోచుకుతిన్నారని, వైఎస్సార్ సీపీ పాలనలో అలాంటివి లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందించామన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతో పాటు టీడీపీ నాయకులు మాఫియాగా తయారై, మట్టి, ఇసుక దోచుకున్నారని విమర్శించారు. పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వలేని పార్టీ టీడీపీ అని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని, దీనిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు.

భూములకు యజమానులైన వేళ

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్నదని, అందులో భాగంగానే రైతులకు సబ్సిడీపై ఎరువులు, యంత్ర పరికరాలు, రైతు భరోసా వంటివి అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సి-క్లాస్ భూములను సాగు చేస్తున్న రైతులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు యజమానులుగా చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం పదేళ్లుగా పట్టాలివ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. ఈ గ్రామంలో 189 మంది రైతులకు 47.20 ఎకరాల భూమికి సి-క్లాస్ పట్టాలిచ్చామని తెలిపారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని, టీడీపీ, జనసేన పార్టీలు కలిసి కట్టుగా వస్తున్నాయని, ప్రజలు మేలు చేసే ప్రభుత్వాన్ని గుర్తించి, ఆదరించాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడుని ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజనీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, వ్యవసాయాధికారిణి మేరీ కిరణ్, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, గుబ్బల శ్రీనివాస్, ఉప సర్పంచ్ చెర్ల శ్రీరామచంద్రమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్టి రాంబాబు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బీరా రాజు, గ్రామ పార్టీ నాయకులు నామన ఆంజనేయులు, కాపకా సురేంద్ర, ఉందుర్తి వెంకటేశ్వర్లు, నేకురి సంపతిరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రుడా నిధులతో సెంట్రల్ లైటింగ్

- దేవరపల్లిలో నేడు మంత్రులతో ప్రారంభం


దేవరపల్లిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్

దేవరపల్లి: రాజమహేంద్రవరం గ్రామీణ అభివృద్ధి సంస్థ(రుడా) నిధులు రూ.65 లక్షల వ్యయంతో దేవరపల్లిలో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయ్యాయి. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు, మూడు రోడ్ల జంక్షన్ నుంచి గోపాలపురం రోడ్డులోని పొగాకు బోర్డు వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కృషితో సెంట్రల్ లైటింగ్‌కు నిధులు మంజూరు కావడంతో పనులు శరవేగంగా పూర్తయ్యాయి. బస్టాండ్, మూడు రోడ్ల జంక్షన్‌లో రెండు హైమాక్స్ లైట్లు ఏర్పాటు చేశారు. సెంట్రల్ లైటింగ్‌తో దేవరపల్లిలోని ప్రధాన రహదారి సుందరంగా రూపుదిద్దుకుంది. లైటింగ్‌ను ఆదివారం సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా మంత్రులు ప్రారంభోత్సవం చేస్తారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు.

గడప గడపలో సమస్యలు పరిష్కారం

- ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు


ఉండ్రాజవరంలో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఉండ్రాజవరం: నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించడానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు అన్నారు. ఉండ్రాజవరంలోని లింగాల పేట, గోగులమ్మ గుడి ఏరియా, ఎస్సీ ఏరియాలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి, వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. స్థానికుల సమస్యలు విని, వెంటనే వాటిని పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. టెక్నికల్, ఇతరత్రా కారణాలతో పథకాలు అందని వారిని గుర్తించి, వారికి సైతం అందేలా కృషి చేస్తామని తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను, ఇవ్వని హామీలను సైతం అధికారంలోకి రాగానే నెరవేర్చి, ప్రజల హృదయాలను జగనన్న గెలిచారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన నిరంతరం పాటుపడుతున్నారని వివరించారు. ఇలాంటి ప్రభుత్వంపై నిత్యం విషం చిమ్ముతున్న టీడీపీ కుట్ర రాజకీయాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నందిగం భాస్కర రామయ్య, వైస్ ఎంపీపీ నరహరిశెట్టి సరోజ, సర్పంచ్ మెండే వెంకట్రావు, తానేటి మురళీమోహన్, చదలవాడ సురేష్, యల్లమిల్లి నారాయణరావు, పి.రాజేంద్రప్రసాద్, రేవాడి యల్లారావు, జుత్తిగ శ్రీనివాసు, రాష్ట్ర కరికాల భత్తుల కార్పొరేషన్ డైరక్టర్ కర్రెళ్ల మంగాదేవి, కర్రెళ్ల శ్రీనివాసు, మండల జేసీఎస్ కన్వీనర్ కఠారి సిద్ధార్థ రాజు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల దినోత్సవం

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెన్షనర్ల దినోత్సవం నిర్వహించనున్నట్టు సంఘ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు తెలిపారు. ఉదయం పది గంటలకు అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తామన్నారు. 11.30కు వాత్సల్య వృద్ధాశ్రమంలో భోజన వసతి, పండ్లు, దుస్తులు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం రెండున్నరకు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో జరిగే పెన్షనర్ల దినోత్సవ కార్యక్రమంలో 75 ఏళ్లు నిండిన 12 మంది పెన్షనర్లను సత్కరించనున్నట్టు వివరించారు.

అథ్లెటిక్స్‌లో నాగేశ్వరి ప్రతిభ



ఉండ్రాజవరం: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో శశి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని ఎ.నాగేశ్వరి ప్రతిభ చాటింది. ఈ నెల 14న పల్నాడు జిల్లా నర్సారావుపేట డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన 67వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ 2023–24 అథ్లెటిక్స్‌లో 4,400 మీ. రిలే అండర్–17 బాలికల విభాగంలో ఆమె కాంస్య పతకం కైవసం చేసుకుంది. విద్యార్థినిని, పీడీలను సంస్థ యాజమాన్యం అభినందించింది.

సృజనాత్మకతను పెంచేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు


వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా స్థాయికి ఎంపికైన అంశాలు

నల్లజర్ల: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచి, శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు పట్టు సాధించేందుకు దోహదపడతాయని నల్లజర్ల సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్ అన్నారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో శనివారం జరిగిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను శాస్త్ర, సాంకేతికతపై అవగాహన పెంపొందించాలన్నారు. గ్రూపు నుంచి 16, వ్యక్తిగతంగా 24, టీచర్ కేటగిరీ నుంచి ఒకటి వైజ్ఞానికాంశాలు వచ్చాయి.

జిల్లా స్థాయికి ఎంపిక

వ్యక్తిగత కేటగిరీ నుంచి పోతవరం విద్యార్థి వి.పవన్ (గైడ్ టీచర్ ప్రభావతి), గ్రూపు కేటగిరీ నుంచి కె.తేజ్‌కిరణ్, పి.దుర్గాశ్రీపవన్‌కుమార్ (నల్లజర్ల జెడ్పీ), టీచర్ కేటగిరీ నుంచి కె.ఉషాపద్మకుమారి (నల్లజర్ల జెడ్పీ)ను జిల్లా స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సీరుకొండ జయకృష్ణ, ఎంఈఓలు వై.సత్యనారాయణ, కె.భగవతి, హెచ్‌ఎం సీహెచ్ కోమలిచిత్ర తదితరులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- మూడు రోజుల పాటు జరగనున్న తీర్థం


నిడదవోలు చినకాశీరేవులో స్నానాల రేవు వద్ద మెట్లు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నిడదవోలు: పట్టణంలోని చినకాశీరేవులో ఉన్న వల్లీదేవర పంచాయతన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18న జరగనున్న షష్ఠి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఏటా ఇక్కడ మూడు రోజుల పాటు షష్ఠి తీర్థాన్ని నిర్వహిస్తారు. నిడదవోలు పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు నిర్వహిస్తారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్ల వద్ద బారికేడ్లు ఏర్పాటుచేశారు. వేకువజామునే భక్తులు గంగాస్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆదేశాల మేరకు ఐదో వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చినకాశీరేవులో ఉన్న ప్రధాన రేవులను శుభ్రం చేశారు. నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైల్వేట్రాక్‌కు ఇరువైపులా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

ఆదాయ వనరులు పెంచేలా చర్యలు

నిడదవోలు రూరల్: గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను పెంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ పి.శామ్యూల్ సూచించారు. సమిశ్రగూడెం మండలపరిషత్ కార్యాలయంలో ఏపీ పంచాయతీరాజ్ చట్టంలోని వివిధ అంశాలు, పంచాయతీల ఆదాయ పురోగతికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామపాలనతో పాటు అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఈఓపీఆర్డీ రత్నమాలిక, ఏఓ రత్నరాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మట్టా వీరాస్వామి

చాగల్లు: ఏపీ పంచాయతీరాజ్ చట్టం నిబంధనల ప్రకారం పనిచేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ మట్టా వీరస్వామి అన్నారు. చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, జూనియర్ అసిస్టెంట్లకు పంచాయతీ సాధారణ పరిపాలన, ఆదాయ వనరుల మెరుగుకు తీసుకోవాల్సిన అంశాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పంచాయతీ రాజ్ చట్టంలోని అంశాలపై అవగాహన కలిగిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆర్.శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోటెత్తిన అన్నవరప్పాడు ఆలయం


అన్నవరప్పాడులో విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెరవలి: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండో ద్వారకా తిరుమలగా పేరుగాంచిన అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచే మహిళా భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 7 తర్వాత ఆలయానికి వేలాదిగా భక్తులు రావటంతో దర్శనానికి సుమారు గంట సమయం పట్టింది. భక్తులకు ఉచిత ప్రసాదాల పంపిణీతో పాటు ఉదయం 10 నుంచి అన్న సమారాధన నిర్వహించారు. దాత సాపిరెడ్డి వెంకటేశ్వరరావు, సత్యవేణి దంపతులు దీనిని ప్రారంభించారు. సుమారు 4 వేల మంది భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

ఆరోగ్యశ్రీ పథకంపై విస్తృత అవగాహన కల్పించాలి

చాగల్లు: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ నిశిత అన్నారు. బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి ఈ పథకంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ప్రభుత్వం అమలుచేస్తున్న వైద్యఖర్చుల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పెంచిందన్నారు. దీనిపై ఈ నెల 18 నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఎ.రామచంద్రం పాల్గొన్నారు.

మహిళకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


ఉండ్రాజవరంలో రామకృష్ణ భార్య శిరీషకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం గ్రామానికి చెందిన బిక్కిన రామకృష్ణ కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.4.74 లక్షల ఆర్థిక సాయం అందింది. గతేడాది రామకృష్ణ కిడ్నీ సంబంధ వ్యాధితో మృతి చెందారు. గతంలో రామకృష్ణ కుటుంబ ఆర్థిక పరిస్థితిపై జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం ఎమ్మెల్యే స్పందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ ఆర్థిక సాయం మంజూరు చేశారు. శనివారం ఉండ్రాజవరంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రామకృష్ణ భార్య శిరీషకు ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడు ఈ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య, సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీ నరహరిశెట్టి సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీ అకాల మృతికి సంతాపం

చాగల్లు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మరణించడంపై చాగల్లు విద్యాశాఖ, యూటీఎఫ్ నాయకులు శనివారం సంతాపం వ్యక్తం చేశారు. సాబ్జీ చిత్రపటానికి ఎంఈఓలు వి.ఖాదర్ బాబు, సీహెచ్ సుభాకర్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రమణ, నాగేశ్వరరావు, షేక్ అబ్దుల్ కరీం, సూరిబాబు, కోటేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు జె.రాజశేఖర్, పిల్లి శ్రీనివాసమూర్తి, రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

సువర్ణ పరిపాలనకు జగనన్నే కావాలి

- 'వై ఏపీ నీడ్స్ జగన్' లో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


పల్లంట్లలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, చిత్రంలో గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ)

దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో సువర్ణ పరిపాలన కావాలంటే మరలా ముఖ్యమంత్రిగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కావాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. పల్లంట్ల గ్రామ సచివాలయం వద్ద శనివారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నాలుగున్నరేళ్లలో అందించిన పథకాలు, జరిగిన సామాజిక సాధికారతను వివరించడానికి సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఆదివారం దేవరపల్లిలో జరుగుతున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చినందున మేము ధైర్యంగా మీ ముందుకు వస్తున్నామని తెలిపారు. కల్లబొల్లి మాటలతో ప్రతిపక్షాలు మరలా మీ ముందుకు వస్తున్నాయని, నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) మాట్లాడుతూ గ్రామంలో నాలుగున్నరేళ్ల పాలనలో సుమారు రూ.33 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు అందజేసినట్టు తెలిపారు. జనవరి నుంచి పింఛను రూ.3 వేలు అందిస్తున్నట్టు చెప్పారు. రూ.22 కోట్ల విలువైన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేసినట్టు తెలిపారు. జగనన్నను ఓడించడానికి ప్రతిపక్షాలు కలుస్తున్నాయని, ఒంటరిగా ఓడించలేక ఓటమిని అంగీకరించి ప్రతిపక్షాలు ఒక అవకాశమంటూ మోసం చేయడానికి వస్తున్నాయని, నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. పథకాల బోర్డును ఎమ్మెల్యే వెంకట్రావు ఆవిష్కరించగా, పార్టీ పతాకాన్ని మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, ఎంపీటీసీ రాయుడు వెంకట్రావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు మేడిబోయిన గంగరాజు, మండల సచివాలయాల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ పాల్గొన్నారు.

20న వేంకటేశ్వర స్వామి కల్యాణం

కొవ్వూరు: పట్టణంలో ఈ నెల 20న సంస్కృత పాఠశాల టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం జరగనుంది. సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు టీటీడీకి చెందిన అన్నమాచార్య కళాకారుల బృందంతో అన్నమాచార్య కీర్తనలు, హరికథ నిర్వహిస్తారు. ఆరు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు టీటీడీ వేద పండితులతో స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ

చాగల్లు: నెలటూరు గ్రామంలో మల్లిపూడి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పది పేద కుటుబాలకు 15 కేజీల చొప్పుల బియ్యాన్ని శనివారం అందజేశారు. ట్రస్ట్ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానిక నాయకులు గెడా శ్యామ్‌సుందరం, వై.రామారావు, ఎం.రంగారావు, అయినం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

